క్లుప్తంగా

విద్యార్థులకు అభ్యసనా సామగ్రి పంపిణీ



అభ్యసనా సామగ్రి అందిస్తున్న హెచ్‌ఎం వెంకటేశన్

నగరి : మున్సిపల్ పరిధిలోని ఏకాంబరకుప్పం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం ఎంఎస్ వెంకటేశన్ రూ.5 వేలు విలువగల అభ్యసనా సామగ్రిని వితరణగా అందించారు. మంగళవారం పాఠశాలలోని 1వ తరగతి వి ద్యార్థులకు నోటుపుస్తకాలు, పలకలు, పెన్సిల్, రబ్బర్, షార్ప్‌నర్‌లను ఆయన వితరణగా అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో ఉత్తరానక్షత్ర పూజలు



ఆలయ పూజల్లో పాల్గొన్న భక్తులు

నగరి : పట్టణ పరిధిలోని బైపాస్ కూడలి సమీపంలో ఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో మంగళవారం స్వామివారి జన్మనక్షత్రమైన ఉత్తరా నక్షత్ర పూజలు వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప పాటల భజనలు, అర్చన మంత్రాలను అధిక సంఖ్యలో అయ్యప్ప భక్తులు ఉచ్చరిస్తూ భజనలు చేశారు. ఆలయ ప్రాంగణంలో పండగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు. స్థానిక భక్తులు ప్రేమలత, కృపానిధి, సత్య, రమేష్ ఉభయదారుగా వ్యవహరించారు. కార్యక్రమంలో గురుస్వామి మురళి, భక్తులు పాల్గొన్నారు.

పకడ్బందీగా సర్వే



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రమేష్

నగరి : కుష్టువ్యాధి గ్రస్తుల గుర్తింపు సర్వే పకడ్బందీగా చేపట్టాలని బుగ్గఅగ్రహారం పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్ అన్నారు. సర్వే చేపట్టాల్సిన విధానాలపై ఆయన వైద్యసిబ్బందికి అవగాహన కల్పించారు. ఈనెల 26 నుంచి జూలై 16వ తేదీ వరకు కుష్టువ్యాధి గ్రస్తుల గుర్తింపు కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రతి గ్రామంలో ఇళ్ల వద్దకు వెళ్లి ఆశావర్కర్లు, వలంటీర్లు పరిశీలించాలని తెలిపారు. ఎవరి శరీరంపైనా అయినా స్పర్శలేని మచ్చలు ఉన్నాయా ? అని ఆరా తీయాలన్నారు. మచ్చ లు ఉన్న వారిని వ్యాధి లక్షణాలు నిర్ధారించడానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపాలన్నారు. కార్యక్రమంలో ఆశావర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


అర్హులందరికీ పథకాలు అందాలన్నదే లక్ష్యం



సర్వే చేస్తున్న అధికారులు, వలంటీర్లు

వెదురుకుప్పం: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందాలన్నదే జగనన్న సురక్ష ప్రధాన ధ్యేయమని ఈఓపీఆర్డీ పురుషోత్తం అన్నారు. మంగళవారం మండలంలోని బొమ్మయ్యపల్లె గ్రామంలో సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేసే పథకాలు ప్రజలకు పూర్తిగా అందాలన్నదే జగనన్న సురక్ష కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలను గుర్తించాలని సూచించారు. ఏకారణం చేత అయినా పథకాలు అందకపోతే వాటిని పరిష్కరించాల్సిన బాధ్యత మనదే అన్నారు. అపరిష్కృత సమస్యల పరిష్కార వేదికే జగనన్న సురక్ష అన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు బాలసుబ్రమణ్యం, మహేష్, వలంటీర్లు పాల్గొన్నారు.

ఈఎస్‌ఐ ఆస్పత్రికి వైద్య పరికరాల వితరణ



కాల్ రేడియో ప్రతినిధులతో ఈఎస్‌ఐ వైద్యులు

తిరుపతి కల్చరల్: తిరుపతిలోని ఈఎస్‌ఐ ఆస్పత్రి ఫిజియోథెరపీ విభాగానికి మంగళవారం వైద్య పరికరాలను వితరణ చేశారు. కాల్ రేడియో ప్రతినిధిలు శ్రీధర్, యోగేశ్వర్ సుమారు రూ.2 లక్షల విలువైన లేజర్ థెరపీ, అనాల్జిసిక్ పల్సర్, పీఈఎంఎఫ్, ఐఎఫ్‌టీ వంటి పరికరాలను అందజేశారు. ఈ పరికరాలతో మరింత మంది రోగులకు మెరుగైన చికిత్స చేసేందుకు దోహదపడుతుందని ఈఎస్‌ఐ ఆస్పత్రి పర్యవేక్షకుడు డాక్టర్ కె. శ్రీధర్, ఆర్‌ఎం డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్ తెలిపారు. వైద్యులు సునీత, ఫిజియో థెరపిస్ట్ వినోద్, ఎన్ఎస్ అమ్ములు తదితరులు పాల్గొన్నారు.

రాత..రోత!

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక కుల, మత, పార్టీలు అనే భేదం లేకుండా అర్హత ఉంటే చాలు సంక్షేమ పథకాలను అందిస్తోంది. 2019 ఎన్నికల సమయంలో వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోలో ప్రకటించిన నవరత్నాల పథకాలను ప్రతి కుటుంబానికి అందుతున్న విషయం ప్రజలకు కూడా తెలుసు. కానీ ఇవేవీ కనిపించని ఎల్లోమీడియా, చంద్రబాబు ద్వయం మాత్రం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీపైనా, ప్రజాప్రతినిధుల పైనా నిత్యం అక్కసు వెళ్లగక్కుతున్నాయి. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మరోమారు వైఎస్సార్‌సీపీకే తమ మద్దతు అని ప్రజలే చెబుతుండడంతో ఇది ఓర్వలేని ఎల్లోమీడియా ప్రతి అంశంలో వంకలు పెడుతూ అసత్య కథనాలు వండి వార్చి నిత్యం విషం చిమ్ముతోంది. దీంతో ప్రజలే ఆ వర్గం మీడియాను ఛీకొడుతున్నారు.

- ఎల్లో మీడియా విషపు రాతలపై జనం ఛీత్కారాలు
- కళ్లెదుటే కనిపిస్తున్న సంక్షేమం, అభివృద్ధి
- వైఎస్సార్‌సీపీకి, డిప్యూటీ సీఎంకి ప్రజల్లో ఆదరణను చూసి ఓర్వలేకే
- ఏదో వంకతో రోజూ అసత్య కథనాలు



డిప్యూటీ సీఎం నారాయణస్వామికి మంగళ హారుతులు పడుతున్న కేశవకుప్పం గ్రామస్తులు (ఫైల్)



'గడప గడపకూ' తాళం!

ఒక పత్రికలో ప్రచురితమైన అసత్య కథనం

కార్వేటినగరం: రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఇంటా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ఏదో రూపంలో లబ్ధి పొందుతున్నారనేది జగమెరిగిన సత్యం. నవరత్నాల పథకాలు అందని వారు లేరనడంలో ఎలాంటి సందేహం లేదు. కానీ ఎక్కడో చిన్న కారణాలతో, సాంకేతిక లోపాల వల్ల కోటిమందిలో ఒకరికి అందకపోతే అదే అవకాశంగా తీసుకుని విషం చిమ్ముతూ వార్తలు రాస్తున్నాయి. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఎల్లోమీడియా, చంద్రబాబు మిత్రద్వయం అసత్య కథనాలు రాయాలని ప్రత్యేక లక్ష్యంగా చేసుకున్నట్లు కనిపిస్తోంది. రాష్ట్రప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలపై ఎల్లోమీడియా కాలకూట విషాన్ని చిమ్ముతూ చంద్రబాబుకు అండగా పచ్చజ్యోతిరేగా నిలుస్తున్నాయి. పాఠకులు కూడా వారి విషపురాతలను చూసి ఛీదరించుకుంటున్నా, వారి వక్రబుద్ధి మాత్రం మరింత నీచస్థాయికి దిగజారుతోందని పలువురు మహిళలు బహిరంగంగా అంటున్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి చేపడుతున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి నియోజకవర్గంలోని ప్రతి మండలంలో, ప్రతి గ్రామంలో కూడా ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తోంది. తమకు సంక్షేమ పథకాల ద్వారా రూ.లక్షల లబ్ధి చేకూరిందని ప్రజలే చెబుతున్నారు. కానీ ఇది ఓర్వలేని పచ్చమీడియా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై బురద చల్లుతూ పైశాచిక ఆనందం పొందుతున్నాయి.

జరిగిన వాస్తవం ఇదీ..

మండల పరిధిలో కేశవకుప్పం పంచాయతీలో సోమవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో లబ్ధిదారులు ప్రతి ఇంటా డిప్యూటీ సీఎం నారాయణస్వామికి మంగళ హారతులు పట్టి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గ్రామస్తులను మంత్రి ఆప్యాయంగా పలకరిస్తూ జగనన్న చేపడుతున్న సంక్షేమాలను వివరించారు. దీంతో ఆనందానికి గురైన ప్రజలు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అంతా లబ్ధి పొందుతున్నామని, ఇలాంటి ప్రభుత్వం ఎప్పుడూ ఉండాలని, మా గ్రామాల్లో ఎక్కడ సమస్యలు లేకుండా చొరవ తీసుకుంటున్న మంత్రికి ఎప్పటికీ రుణపడి ఉంటామని ప్రజనలు దీవెనలు అందించారు.

అవాస్తవం ..

కేశవకుప్పం పంచాయతీలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఆంధ్రజ్యోతి రిపోర్టర్ అడుగు పెట్టకుండా, గ్రామంలో ఎవరినీ విచారించకుండా కేశవకుప్పం ఎస్టీకాలనీలో మూడు ఇళ్లకు చెందిన వారు మామిడి కోతలకు వెళ్లారు. దీంతో వారి ఇళ్లలో ఎవరూ లేకపోవడంతో ఎస్టీకాలనీ, తానా ఇండ్లు గ్రామాల్లో 30 కుటుంబాలు మంత్రి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి వస్తున్నారని, ఇంటికి తాళాలు వేశారని, దీంతో మంత్రి వెనుదిరిగినట్లు అవాస్తవ కథనాలు రాసి ప్రభుత్వం బురద చల్లేందుకు చూస్తున్నారు.

నిజాన్ని చూపించాలి..



ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనం అసత్యం, మంత్రిపై బురద చల్లేందుకు ఇదో కుట్ర, ఇంటింటికీ వచ్చిన మంత్రి నారాయణస్వామికి ప్రతి గడపలో మంగళ హారుతులు పట్టారు. రిపోర్టర్ రాకుండానే ప్రభుత్వ కార్యక్రమంపై అసత్య కథనం రాశారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

– శేఖర్‌రాజు, మండల కన్వీనర్, కార్వేటినగరం

బాబు కనుసన్నల్లోనే..



చంద్రబాబు అడుగులకు మడుగులు వేస్తూ ఆయన కనుసన్నల్లో నడిచే ఎల్లోమీడియా పేపర్లలో ఇలాంటి కథనాలు రాస్తే ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరు. ఆ పత్రికలపై ప్రజలకు నమ్మకం పోయింది. రానున్న రోజుల్లో ఆ పత్రికలు కనుమరుగు కావడం ఖాయం.

– దొరస్వామి, కేశవకుప్పం, కార్వేటినగరం

కమనీయం.. ద్రౌపదీదేవి కల్యాణం





కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు, పురవీధుల్లో ఊరేగుతున్న ద్రౌపదీ అమ్మవారు

కార్వేటినగరం: మండలకేంద్రంలోని ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో జరుగుతున్న వార్షిక మహాభారత ఉత్సవాల్లో భాగంగా ఐదోరోజు మంగళవారం సాయంత్రం అమ్మవారి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ద్రౌపదీదేవి అమ్మవారు, ధర్మరాజులు, భీమ, అర్జున, నకుల, సహదేవ ఉత్సవమూర్తులను ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన పెళ్లిపందిరికి తీసుకొచ్చారు. అనంతరం ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, సుగంధ పరిమళ భరిత పుష్పాలు, స్వర్ణాభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. సకల దేవతలకు ఆహ్వానం పలుకుతూ అమ్మవారి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అర్చకులు వేదమంత్రాలను పఠిస్తుండగా మంగళవాయిద్యాల నడుమ అమ్మవారి కల్యాణం నేత్రపర్వంగా సాగింది. అధిక సంఖ్యలో దంపతులు అమ్మవారి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. మధ్యాహ్నం భాగతారిణి రెడ్డెమ్మ హరికథా కాలక్షేపం చేశారు. భక్తులకు కనులకు కట్టినట్లుగా కల్యాణోత్సవం ఘట్టాన్ని వివరించారు. కార్వేటినగరంలోని రెడ్డికులస్తులు ఈ కార్యక్రమానికి ఉభయదారులుగా వ్యవహరించారు. అలాగే భక్తులకు రెడ్డికులస్తుల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. రాత్రి సుందరంగా అలంకరించిన అమ్మవారిని ప్రత్యేక వాహనంపై ప్రతిష్టించి నగర వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి వడిబాల సమర్పించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు సోమనాథ్, కమిటీ సభ్యులు హరిబాబు, శివప్రకాష్, బాబురెడ్డి, కృష్ణయ్యయాదవ్, పాల్గొన్నారు.

జగనన్న సురక్ష అమలుపై సమీక్ష



మాట్లాడుతున్న మున్సిపల్ ఎంఎల్‌ఓ దిలీప్‌మొదలి

పుత్తూరు రూరల్: ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలకు, సేవలకు పరిపూర్ణత చేకూర్చేదే జగనన్న సురక్ష పథకమని ఎఫ్ఓఏ, ఎంఎల్ఓ దిలీప్‌మొదలి చెప్పారు. మంగళవారం పుత్తూరు పట్టణ పరిధిలోని లక్ష్మీనగర్ సచివాలయ పరిధిలో, రూరల్ పరిధిలోని నేసనూరు, రామకృష్ణాపురం తడుకు సచివాలయ పరిధిలో జగనన్న సురక్ష శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అర్హత ఉండి, వివిధ సేవలు, పథకాల లబ్ధి పొందడంలో విఫలమైన వారిని గుర్తించి వారికి లబ్ధి చేకూర్చడమే ఈ జగనన్న సురక్ష పథక లక్ష్యమని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఏ.హరి, కౌన్సిలర్లు ఏకాంబరం, నరసింహ, పవన్‌కుమార్, ఏఎంసీ జేసీఎస్ కన్వీనర్ భాస్కర్‌యాదవ్, వైస్ ఎంపీపీ మునస్వామిరెడ్డి, సర్పంచులు గోవిందస్వామిరెడ్డి, మురళీయాదవ్, కన్వీనర్లు గోపి, మోహన్, మస్తాన్, శ్రీనివాసులు, మధు, తిరుమలరెడ్డి, చక్రవర్తి, రామ్మూర్తిరెడ్డి, బాబు, వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

పవర్‌లూమ్స్ కార్మికుల వినతి

పుత్తూరు రూరల్: పవర్‌లూమ్స్ వర్కర్లకు విద్యుత్ చార్జీలు తగ్గించాలని కోరుతూ స్థానిక ఏపీ ట్రాన్స్‌కో డీఈఈ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. పవర్‌లూమ్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు వీరన్ మాట్లాడుతూ కార్మికులు పనులు లేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో విద్యుత్ చార్జీల పెరుగుదల వారికి మోయలేని భారమన్నారు. ప్రభుత్వం పవర్‌లూమ్స్ కార్మికులకు 500 యూనిట్లు వర కు ఉచితంగా విద్యుత్ ఇవ్వాలని కోరారు. ఈ మేరకు డీఈఈకి వినతిపత్రం అందజేశారు.

ఘనంగా గంగమ్మ జాతర



అమ్మవారికి పొంగళ్లు తీసుకెళ్తున్న మహిళలు

శ్రీరంగరాజపురం : మండలానికే తలమానికమైన త య్యూరు గంగమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. గ్రామంలో వెలసిన నడివీధి గంగమ్మ జాతరను పురస్కరించుకుని మంగళవారం మహిళలు పొంగళ్లు వండి, పిండిదీపాలు పెట్టి, కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఏటా గ్రామస్తులు గంగమ్మ జాతరను కులమతాలకు అతీతంగా భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. ఈ గ్రామ జాతరకు ఓ ప్రత్యేకత ఉంది. ఈ గ్రామం నుంచి పెళ్లి చేసుకుని వెళ్లిన ప్రతి ఆడపడుచులు తప్పక హాజరై అమ్మవారికి పొంగళ్లు సమర్పించడం ఆనవాయితీ. దీంతో ఆలయం మహిళలతో నిండి పోయింది. జాతరలో భాగంగా నడివీధి గంగమ్మను రాత్రి పట్టువస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అలాగే గ్రామ సర్పంచ్ వరదమ్మ మంగళ వాయిద్యాల నడుమ బాణసంచా పేలుళ్ల మధ్య అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం పురవీధుల్లో అమ్మవారిని ఊరేగించారు. కార్యక్రమంలో జాతర పెద్దలు మణి, తులసిమణి, రవి, సుబ్రమణ్యం, కుప్పయ్య, కుమార్, రమేష్, శివలింగం, చంగ్రాయులు, గుండుమణి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మహాకుంభాభిషేక పూజలు



యాగశాలకు కలశాలను తీసుకొస్తున్న వేదపండితులు

పాలసముద్రం : మండలంలోని శ్రీకావేరిరాజుపురం దళితవాడలో వెలసిన రాధారుక్మిణీ సమేత కృష్ణ ఆలయంలో మహాకుంభాభిషేకం వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా మంగళవారం ఆలయంలో నవగ్రహ, శాంతిహోమం, ద్వితీయకాల యాగశాల పూజలు నిర్వహించారు. భక్తులు తొమ్మిదిబావుల్లో నీటిని తీసుకొచ్చి యాగశాలల్లో ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం స్వామివారి చిత్రపటాన్ని మంగళ వాయిద్యాలతో పురవీధుల్లో ఊరేగించారు. సాయంత్రం యాగశాలలో వేదపండితులు దుర్గా హోమం, మూడవకాల యాగశాల పూజలు నిర్వహించారు. కలశాలను వేదపండితులు గ్రామంలో ఊరేగించి యాగశాలకు చేర్చారు. బుధవారం ఉదయం 9 గంటల 10.30 గంటల మధ్యలో మహాకుంభాభిషేకం, నాలుగో కాలయాగశాల పూజలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. అలాగే సాయంత్రం స్వామివారి కల్యాణం, ఊరేగింపు ఉంటుందన్నారు. భక్తుల కోసం వీధినాటకం ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా మణిగండన్ అనే వ్యక్తి భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

ప్రజల కోసమే జగనన్న సురక్ష

– డిప్యూటీ సీఎం నారాయణస్వామి



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

గంగాధరనెల్లూరు(కార్వేటినగరం): రాష్ట్ర ప్రజల రక్షణకే జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తామని డిప్యూటీ సీఎం నారాయణస్వామి తెలిపారు. మంగళవారం మండలంలోని కడపగుంట గ్రామ సచివాలయ పరిధిలోని గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ముగిసిన తరువాత ఆయన మీడియాతో మాట్లాడారు. సచివాలయ ఉద్యోగులు, పార్టీ నాయకులు, వలంటీర్లు, గృహ సారథులు ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించే దిశగా జూలై1వ తేదీన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమం జూలై 30వ తేదీ వరకు జరుగుతుందన్నారు. ప్రజలకు అందుతున్న 11 రకాల సేవలకు సర్వీస్ చార్జీలు ఉచితంగా అందించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మరో చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరునంలో చంద్రబాబు, లోకేష్, దత్తపుత్రుడు పవన్ కల్యాణ్ రాష్ట్రంపై విరుచుకుపడుతున్నారని అన్నారు. 14 ఏళ్లపాటు సీఎంగా వెలగబెట్టిన చంద్రబాబు ప్రజలకు చేసిందేమీ లేదని రాష్ట్ర ప్రజలే బాహాటంగా చెబుతున్నారని తెలిపారు. 2014 ఎన్నికల నాటి హామీలను తుంగలో తొక్కిన చంద్రబాబు ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారని ఆరోపించారు. ఏనాడూ ప్రభుత్వ స్కూళ్లను పట్టించుకోని చంద్రబాబు, తన హయాంలో కార్పొరేట్‌లను ప్రోత్సహించారని దుయ్యబట్టారు. కానీ జగనన్న సీఎం అయ్యాక ఈ 4 సంవత్సరాల కాలంలో ఎన్నికల హామీలన్నీ నెరవేర్చారని వివరించారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా తీర్చి దిద్దడంతో పాటు ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టిన ఘనత సీఎం జగనన్నకే దక్కిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శివప్రకాష్‌రాజు, ఏఎంసీ చైర్మన్ కమలాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ ప్రసాద్‌రెడ్డి, సుబ్బయ్య, ధనంజయరెడ్డి, మండల కన్వీనర్ పూర్ణచంద్రారెడ్డి, ఎంపీటీసీ ఉమామహేశ్వరి, సర్పంచ్ బుజ్జి, ఎంపీపీ అనిత, వైస్ ఎంపీపీ హరిబాబు, గోవిందరెడ్డి, గుణశేఖర్ రెడ్డి, వెంకటరెడ్డి, మాజీ ఎంపీటీసీ పుష్పరాజ్ తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా ఉపాధి పనులు



నింద్ర క్లస్టర్ కార్యాలయంలో ఉపాధి సమీక్షలో మాట్లాడుతున్న డ్వామా పీడీ గంగాభవాని



జీఎన్ కండ్రిగలో అమృత్ సరోవర్ పనులు చేస్తున్న కూలీలతో మాట్లాడుతున్న డ్వామా పీడీ గంగాభవానీ

- నగరి, నింద్ర మండలాల్లో డ్వామా పీడీ పర్యటన
- సచివాలయాలు, ఉపాధి పనులు తనిఖీ
- నింద్ర క్లస్టర్ కార్యాలయంలో 6 మండలాల సిబ్బందితో పీడీ సమీక్ష

పిచ్చాటూరు: జిల్లాలో విస్తృతంగా ఉపాధి పనులు చేపట్టాలని డ్వామా పీడీ గంగాభవానీ సూచించారు. మంగళవారం ఉదయం 9 గంటలకు నగరి మండలం వేలావడికి క్లస్టర్ ఏపీడీ శోభన్‌బాబుతో కలిసి పీడీ చేరుకుని కాలువ పనులను పరిశీలించారు. అనంతరం నింద్ర మండలం ఇరుగువాయి, జీఎన్ కండ్రిగ గ్రామాల్లో అమృత్ సరోవర్ చెరువులను సందర్శించారు. అక్కడ నుంచి చవరంబాక్కం చేరుకుని కాలువ పనులను సందర్శించి కూలీలతో ముచ్చటించారు. అనంతరం ఆరూరు, ఎలకాటూరు సచివాలయాలను సందర్శించి జగనన్న సురక్ష సర్వేపై సమీక్షించారు. ఉదయం 11.30 గంటలకు నింద్ర క్లస్టర్ కార్యాలయంలో 6 మండలాల ఉపాధిహామీ అధికారులు, సిబ్బందితో పీడీ సమావేశం నిర్వహించారు. ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు ఉపాధి పనులు కల్పించాలని సూచించారు. పనికి రాని వారిని గుర్తించి పనికి వచ్చేలా చైతన్యపరచాలన్నారు. వీలైనంత ఎక్కువ మందికి పని కల్పించి నిర్దేశించిన పనిదినాలు లక్ష్యాన్ని చేరుకోవాలని ఆమె సూచించారు. అలాగే వర్షాకాలం ప్రారంభమైనందున పండ్లు, పూల తోటలు పెంపకంపై దృష్టి సారించాలన్నారు. సమావేశానికి గైర్హాజరు అయిన వారికి మెమోలు ఇవ్వాలని ఆదేశించారు. సమావేశంలో నింద్ర, నగరి, విజయపురం, కార్వేటినగరం, ఎస్ఆర్‌పురం, వెదురుకుప్పం మండలాల ఏపీఓలు, జేఈలు, ఈసీ, సాంకేతిక, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

పేరెంట్స్ కమిటీ సమావేశాలు నిర్వహించండి





సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీదేవి, సమావేశంలో పాల్గొన్న హెచ్‌ఎంలు

నగరి : నగరి మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాఠశాలల్లో పేరెంట్స్ కమిటీ సమావేశాలు తప్పనిసరిగా నిర్వహించాలని ఎంఈఓలు శ్రీదేవి, సమశ్శివాయం అన్నారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో మండలంలోని పాఠశాలల హెచ్‌ఎంలతో ఆమె సమావేశయ్యారు. ఈ సందర్భంగా ఆమె జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి సూచించిన విషయాలపై చర్చించారు. అన్ని యాజమాన్య ప్రాథమిక ప్రాథమిక ఉన్నత పాఠశాలలో పేరెంట్స్ కమిటీ మీటింగ్ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. మండల అధికారులు ఈ సమావేశాల్లో పాల్గొని ప్రత్యక్షంగా పరిశీలించడం జరుగుతుందన్నారు. కనుక ముందస్తు ఏర్పాటులో భాగంగా పేరెంట్స్ కమిటీ సభ్యులు ఆహ్వానం పంపి సమావేశం నిర్వహించాలని సూచించారు. పాఠశాల సమయపాలన, అకడమిక్ క్యాలెండర్, హెచ్‌ఎం టైంటేబుల్ తప్పనిసరి అన్నారు. విద్యార్థుల సమోదు, రోజువారి నివేదికలు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సూచించారు. విద్యార్థులు తప్పనిసరిగా యూనిఫాం ధరించి రావాలని, హాజరు తప్పనిసరిగా వేయాలని సూచించారు. హైస్కూళ్లలో వెనుకబడిన విద్యార్థులకు ఉదయం, సాయంత్రం క్లాసులు కండక్ట్ చేయాలన్నారు.

విద్యార్థుల శాతం పెంచాలి

పాలసముద్రం : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల శాతం పెంచడానికి పేరెంట్స్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ రాజేంద్రప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆముదాల ప్రాథమిక పాఠశాలల్లో హెచ్‌ఎం సురేష్ బాబు ఆధ్వర్యంలో పేరెంట్స్ కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం అమ్మఒడి పథకం ద్వారా రూ.15 వేలు, జగనన్న విద్యాకానుక, నాడు–నేడు పథకం కింద స్కూళ్లలో మౌలిక వసతులు కల్పిస్తోందన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ఇంగ్లిష్ మీడియం అమలు చేస్తున్నారని, అందువల్ల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ స్కూళ్లలోనే చేర్పించాలని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



పేరెంట్స్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ రాజేంద్రప్రసాద్



మాట్లాడుతున్న హెచ్‌ఎం సోమశేఖర్

స్కూల్ అభివృద్ధిలో తల్లిదండ్రులే కీలకం

విజయపురం (నగరి) : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర కీలకమని శ్రీహరిపురం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సోమశేఖర్ అన్నారు. మంగళవారం స్కూల్‌లో పేరెంట్స్ కమిటీ చైర్మన్ అంజలి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం సోమశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం విద్య, పాఠశాలల అభివృద్ధికి ఎంతో ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం జగనన్న విద్యాకానుక, జగనన్న గోరుముద్ద జగనన్న ఆణిముత్యం కార్యక్రమాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయండి





సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్యామల, మండల మీట్‌కు హాజరైన అధికారులు

పాలసముద్రం : మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు పూర్తి చేయడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి పెట్టాలని ఎంపీపీ శ్యామల, జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్ తెలిపారు. మంగళవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ప్రేమ్ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ మండల పరిధిలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి చొరవతో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. వనదుర్గాపురం నుంచి రాచపాళెం, ఎల్ఎన్ పురం నుంచి టీవీఎన్ఆర్ పురం గ్రామాలకు ఏళ్ల తరబడి రోడ్డు లేక ప్రజలు ఇబ్బందులు పడ్డారని తెలిపారు. అయితే ఆ గ్రామాల పరిధిలో అటవీ శాఖ నుంచి అనుమతులు మంజూరు చేయించి 30 అడుగుల రోడ్డు వేయించి ఎన్నో ఏళ్ల ప్రజల కలను నెరవేర్చామన్నారు. గత కొన్నిరోజుల కిందట మండలంలో డిప్యూటీ సీఎం నారాయణ స్వామి నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన సమస్యలను కూడా త్వరితగతిన పరిష్కరించేలా అధికారులు కృషి చేయాలన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్ మాట్లాడుతూ ఆముదాల అంగన్‌వాడీ కేంద్రంలో ఒక్కరు కూడా పిల్లలు లేరని, హంసారంలో మినిఅంగన్‌వాడీ కేంద్రం కావాలని సీడీపీఓ పద్మసునందను అడిగారు, మండలంలో కొన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాలను సక్రమంగా అందించడం లేదని పలువురు సభ్యులు సభ దృష్టికి తెచ్చారు. పెనుమూరు ఏఎంసీ చైర్మన్ బండి కమలాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ స్కూల్‌కు వచ్చే ప్రతి విద్యార్థికి రూ.2500 విలువజేసే జగనన్న విద్యాకానుక కిట్ ఇస్తున్నారని తెలిపారు. సమావేశంలో ఏఓ డిల్లీప్రసాద్, ఐకేపీ ఏపీఎం ఫరీద్ మస్తాన్, వైద్యాధికారి మోహన్‌కృష్ణ పశువైద్యాధికారి యశస్వి, ఉపాధిహామీ జేఈ అనుషా, ఎంఈఓ రాజేంద్రప్రసాద్, పీహెచ్‌సీ కమిటీ చైర్మన్ శివప్రకాష్‌రాజు, వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్, పుష్ప, ఎంపీటీసీ గోవిందరాజు, లిఖిత, సర్పంచ్ గాలి మహేష్ బాబు, అయ్యప్ప, జీవిత, శీబా, డిప్యూటీ తహసీల్దార్ మదుబాబు, సూపరింటెండెంట్ విద్యావతి, మండల విస్తరణాధికారి రమేష్, హౌసింగ్ ఏఈ దాము, సీడీపీఓ పద్మసునంద, సుమన్, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.